క్లుప్తంగా

నేడు గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే ప్రచారం

గుమ్మలక్ష్మీపురం: మండలంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కుంబురుక దీనమయ్య ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. సి.హెచ్.బిన్నిడి, ఆర్.జమ్ము, బాలేసు గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి, ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈ కిశోర్‌కుమార్ ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. విద్యుత్ లైన్లు, స్తంభాల వద్ద ఉన్న ముళ్లపొదలు, తుప్పలు తొలగిస్తున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళశాసనం, శాత్తుముర్రై, తీర్థఘోష్టి, పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట


పూజల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని సీతారాంపురం రామాలయంలో సీతారామలక్ష్మణుల విగ్రహాలతో పాటు ఆంజనేయస్వామి విగ్రహాన్ని శనివారం పునఃప్రతిష్ఠించారు. పురోహితులు కె.మురళీమోహన్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం పూజలు, ప్రత్యేక అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

జియ్యమ్మవలస: వేసవి ఎండల నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని బాసంగి పంచాయతీ పరిధిలోని ఎం.హరిపురం గ్రామంలో పాడైన తాగునీటి బోర్లను యుద్ధప్రాతిపదికన శనివారం బాగుచేశారు. ప్రస్తుతం అన్నిచోట్ల తాగునీరు పుష్కలంగా లభిస్తుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డీఐవో పరిశీలన


మందుల కాలపరిమితి పరిశీలిస్తున్న డీఐవో నారాయణ

కురుపాం: మండలంలోని మొండెంఖల్ పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ని పార్వతీపురం మన్యం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐవో) మూటక నారాయణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, వైద్యుల పనితీరు, రికార్డుల నిర్వహణ, మందుల నిల్వలు, వాటి కాల పరిమితిని పరిశీలించారు. రోగులకు నిరంతరం అందుబాటులో ఉండి, వారికి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని సూచించారు.

ప్రముఖ రంగస్థల నటుడు మృతి


కృష్ణుడి వేషధారణలో సంగమేశ్వరరావు(ఫైల్)

గరుగుబిల్లి: ప్రముఖ రంగస్థల నటుడు ఎన్ని సంగమేశ్వరరావు(75) శనివారం ఉదయం కన్నుమూశారు. మండలంలోని చినగుడబ గ్రామానికి చెందిన ఆయన స్వగృహంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల కళాకారులు, సాహిత్యకారులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. సంగమేశ్వరరావు మృతి కళారంగానికి తీరని లోటు అని కొనియాడారు. తొలినాళ్లలో హార్మోనియం వాయిద్యకారుడిగా సుపరిచితుడైన ఆయన ఆ తర్వాత రంగస్థలంపై కృష్ణుడు, నక్షత్రకుడి పాత్రలు వేసి, అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్ర దేశ్‌లో వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కుళాయి పనుల పరిశీలన

సీతానగరం: మండలంలోని చినబోగిలిలో నిర్దేశించిన గడువులోగా జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా చేపడుతున్న ఇంటింటి కుళాయిల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరాకు చర్యలు చేపట్టామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ అన్నారు. శనివారం చినబోగిలిలో జరుగుతున్న ఇంటింటి కుళాయి నిర్మాణ పనులు ఆయన పరిశీలించారు. గ్రామంలో రూ.28లక్షలతో సుమారు 670 ఇంటింటి కుళాయిల పనులు చేపట్టినట్టు తెలిపారు.

వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే మరింత సంక్షేమం, అభివృద్ధి


ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపిస్తే మరింత సంక్షేమం, అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పాడి, ఒప్పంగి, లండగొర్లి, లండగొర్లిగూడ, సీడుమానుగూడ, సంతోషపురం, తోటగూడ, రస్తాకుంటుబాయి, తెన్నుఖర్జ, గొటివాడ, సూర్యనగరం, మర్రిగూడ, మంత్రజోల, నేరేడువలస, దురుబిలి గ్రామాల్లో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగించారని, ఆయన పాలనలో మారుమూల గిరిజన గ్రామాలు సైతం అభివృద్ధి బాటపట్టాయని, ఎంతోమంది సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధితో జీవనోపాధి పొందారన్నారు. సీఎం జగనన్నతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలు చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి నాయకులు చెప్పే మోసపూరిత హామీలను నమ్మవద్దన్నారు. చంద్రబాబును నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. వలంటీర్ సేవలను చంద్రబాబు అడ్డుకోవడం వల్లే ఎంతోమంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో రాష్ట్ర ప్రభుత్వ సేవలను ఒకసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. మనమంతా బాగుపడాలంటే 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అందరూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో తనను, పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పాడి సర్పంచ్ మూటక సుస్మిత, రస్తాకుంటుబాయి సర్పంచ్ ఆరిక సునీత, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, గౌడు సంతోషిరాణి, ఊలక కృష్ణవేణి, తిమ్మక సునీత, రాజేశ్వరి, గుడారి విద్యారాణి, వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటీశ్వరరావు, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

● ప్రగతి బాట





చిత్రంలో కనిపిస్తున్నది.. కొమరాడ మండలంలోని పాలేం గ్రామ బీటీ రోడ్డు. గతంలోని టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు అధ్వానంగా ఉండేది. దీంతో అటువైపుగా వెళ్లే వారంతా నానా అవస్థలు పడేవారు. ఇదే సమస్యను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి దృష్టికి తీసుకువెళ్లగా, ఆమె చొరవతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రూ.1.60 కోట్లతో మాదలింగి జంక్షన్ నుంచి పాలేం గ్రామం వరకు 2 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించారు. చాలారోజుల తర్వాత తమ వేదన తీరిందని, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

–కొమరాడ

పార్టీ మారగానే సమస్యలు కొత్తగా కనిపిస్తున్నాయా..


భామిని: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: టీడీపీ నుంచి జనసేనలోకి మారిన నిమ్మక జయకృష్ణకు మండలంలోని సమస్యలు కొత్తగా కనిపిస్తున్నాయా అంటూ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షుడు కొవ్వాడ చిరంజీవులు, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహనబాబు విమర్శించారు. ఈ మేరకు శనివారం వారు మాట్లాడుతూ.. జనసేనలో చేరిన తరువాత భామినిలో నిమ్మక జయకృష్ణ చేసిన ఆరోపణలను ఖండించారు. మండలంలోని నీటి పథకాలకు జలయజ్ఞం కింద డాక్టర్ వైఎస్సార్ నిధులు మంజూరు చేసి పనులు చేపట్టగా.. తరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిధులు నిలిపివేసి పనులను అడ్డుకుందని ఆరోపించారు. జనసేన పార్టీ టికెట్ కోసం తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. ఐటీడీఏ నుంచి వచ్చిన ట్రైకార్ రుణాల రాయితీలు అసలైన గిరిజనులకు అందకుండా జన్మభూమి కమిటీలే స్వాహా చేశాయని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ గిరిజన గ్రామానికి పక్కా తారురోడ్లు, సీసీరోడ్లు వేశామని, గత టీడీపీ పాలనలో కనీసం ఒక్క గ్రామానికైనా పక్కారోడ్డు వేశారా అని నిలదీశారు. జగనన్న ప్రభుత్వం గిరిజనులందరికీ సంక్షేమ పథకాలతో పాటు పోడు భూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చి రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందించిందని గుర్తుచేశారు. పీటీజీలకు 50 ఏళ్లకే పింఛన్లు అందించామన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో పర్యటించి చేసిన అభివృద్ధిని చూసి మాట్లాడాలని కోరారు. పార్టీ మండల నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్, కాగితాపల్లి కృష్ణారావు, కిల్లారి ఫాల్గుణరావు, కొత్తకోట ఆంజనేయులు, కార్యకర్తలు ఉన్నారు.

హడ్డుబంగిలో వైఎస్సార్‌సీపీ పటిష్టం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతంపేట: హడ్డుబంగి పంచాయతీలో వైఎస్సార్ సీపీ పటిష్టంగా ఉందని ఆ పార్టీ నాయకులు ఎస్.సన్యాసిరావు, షోడంగా తదితరులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి పూర్తిస్థాయి మద్దతు తెలియజేస్తున్నామన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆమెను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. హడ్డుబంగి పంచాయతీలో పార్టీ మారినట్లు ప్రచారం చేస్తున్న ఒకరిద్దరు ఎప్పటి నుంచో వైఎస్సార్‌సీపీలో లేరన్నారు. ఇప్పుడు జనసేన కండువా కప్పుకున్నంత మాత్రాన ఏమీ ఒరిగేది లేదన్నారు. ఎమ్మెల్యే కళావతి ఈ పంచాయతీలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల ద్వారా అనేక మందికి లబ్ధి జరిగిందని గుర్తుచేశారు. కళావతి గెలుపును ఎవ్వరూ ఆపలేరన్నారు. ప్రజలంతా ఆమె వెనుక ఉన్నారన్నారు. కార్యక్రమంలో కొండాడ సర్పంచ్ ఆనప, నాయకులు పెంటయ్య, తవిటిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి: డీఎస్పీ


వీరఘట్టం: నడిమికెల్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ చంద్రమౌళి, ఎస్సై ఫక్రుద్దీన్

పాలకొండ: నియోజకవర్గ కేంద్రానికి వచ్చే రహదారుల్లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులను డీఎస్పీ కృష్ణారావు శనివారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా తనిఖీలు ముమ్మరం చేసినట్లు చెప్పారు. ప్రతీ గ్రామంలో పోలీసు బలగాలు పర్యటించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రజలంతా సహకరించాలి

వీరఘట్టం: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని పాలకొండ సీఐ చంద్రమౌళి కోరారు. మండలంలోని నడిమికెల్లలో శనివారం పర్యటించారు. ఎన్నికల నియమావళిని అందరూ విధిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ ఉన్నారు.

ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశ పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 6వ తరగతిలో వంద సీట్లు అందుబాటులో ఉండగా 215 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9440322964లో సంప్రదించాలని కోరారు.

నేడు సీతంపేటలో ఎన్నికల ప్రచారం

సీతంపేట: సీతంపేట మండల కేంద్రంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం ఎన్నికల ప్రచారం చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు తెలిపారు. పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

60 లీటర్ల సారా పట్టివేత

వీరఘట్టం: గంగమ్మపేట సమీపంలో స్కూటీతో సారా తరలిస్తున్న వ్యక్తిని శనివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 60 లీటర్ల సారాతో పాటు స్కూటీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పాలకొండ రూరల్: సచివాయాల పరిధిలో ఏర్పాటుచేస్తున్న డిజిటల్ గ్రంథాలయాలను గ్రామీణ యువత సద్వినియోగపర్చుకోవాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని చిన్న మంగళాపురంలో సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. అక్కడి డిజిటల్ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలపై అడ్మిన్ సెక్రటరీని అడిగి తెలుసుకు న్నారు. నిర్వహించారు. ప్రస్తుత వేసవి నేపథ్యంలో తాగునీరు, మంచినీటి వనరుల సంరక్షణ, ప్రజారోగ్యం, పారిశుద్ధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

పాలకొండ: ఎన్నికల నియమావళి విధిగా పాటించాలని నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించి ఎన్నికల కోడ్ అమలు తీరును పరిశీలించారు. వార్డుల్లో ఎక్కడా అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సచివాలయాల పరిధిలో ఎటువంటి ప్రచారం నిర్వహించిన ముందుగా అనుమతులు తీసుకోవాలన్నారు. బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఉద్యోగులు రాజకీయ ప్రచారాల్లో పాల్గొనరాదు

సీతంపేట: ఉద్యోగులు ఎవ్వరూ రాజకీయ ప్రచారాల్లో పాల్గొనద్దని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి సూచించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎవ్వరూ రాజకీయ ప్రచారాల్లో పాల్గొనరాదన్నారు. ఇప్పటికే ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ పరిశీలన బృందాలు ఉద్యోగులపై నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. ప్రవర్తన నియమావళి అతిక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


కళ్లికోట వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్మోహనరావు

కొమరాడ: ప్రజలు జ్వరాల బారినపడకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని కళ్లికోట గ్రామంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌తో పాటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం పాటిస్తూ ఇంటి ఆవరణలో మురుగునీరు, చెత్తాచెదారం ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైతే నిల్వనీరు ఉంటుందో అక్కడ దోమలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని, దోమల బారినపడితే డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వస్తాయన్నారు. వేసవి ఎండల నేపథ్యంలో ప్రతిఒక్కరూ తరచూ నిమ్మరసం, మజ్జిగ, మంచినీరు తాగాలని తెలిపారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని, బయటకు వెళ్లేటప్పుడు తాగునీరు, గొడుగు వెంట తీసుకువెళ్లాలన్నారు.

పామాయిల్ తోటకు నిప్పు


కాలిపోయిన పామాయిల్ చెట్లు

కొమరాడ: మండలంలోని సీతమాంబపురం(అగ్రహారం) సమీపంలోని పామాయిల్ తోటకు ప్రమాదవశాత్తు శనివారం నిప్పంటుకుంది. చెట్లతో పాటు చెట్లకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ పైపులు, పరికరాలు కూడా కాలిపోయాయని బాధిత రైతు విశ్వేశ్వరరావు వాపోయారు. అధికారులు చర్యలు తీసుకుని, ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా చూడాలని కోరారు.

ఘనంగా ఉత్సవ విగ్రహాల తిరువీధి


తిరువీధిలో పాల్గొన్న భక్తులు

భామిని: చిన్నదిమిలి గ్రామంలో నూతనంగా నిర్మించిన రఘురామాలయం ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా శనివారం ఉత్సవ విగ్రహాల తిరువీధి వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, భజనలు, మహిళల కోలాటం మధ్య మహిళలు ఘటాలతో తిరువీధిలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తిరువీధి అనంతరం దేవతామూర్తుల విగ్రహాలకు జలాదివాసం, యాగశాలలో హోమాదికారులు నిర్వహించా రు. భక్తుల శ్రీరామ జపంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

బీజేపీ భావజాలం ప్రజాస్వామ్యానికి ముప్పు


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణరావు

సీతంపేట: బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం మరి ఉండదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావల రమణరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో 'సార్వత్రిక ఎన్నికలు, కార్మికవర్గ కర్తవ్యం' అనే అంశంపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు ఒకే దేశం, ఒకే భాష, ఒకే సంస్కృతిని కోరుకుంటున్నాయన్నారు. ఒకే ఎన్నికలు ఉండాలని కూడా భావిస్తున్నారన్నారు. ఇది ఫెడరల్ నిర్మాణాన్ని నాశనం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

11 మంది వలంటీర్ల రాజీనామా


వీరఘట్టం: పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందజేస్తు తూడి గ్రామ వలంటీర్లు

వీరఘట్టం: మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతునే ఉన్నాయి. శనివారం తూడి గ్రామానికి చెందిన 11 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందజేశారు. టీడీపీ కూటమి, పచ్చమీడియా వలంటీర్లపై నిత్యం అసత్య ఆరోపణలు చేస్తుండడం తమను ఎంతగానో బాధిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రాజీనామాలు చేసి ప్రత్యక్షంగా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ప్రచారం చేయనున్నట్లు చెప్పారు.

41 మంది వలంటీర్ల రాజీనామా

జియ్యమ్మవలస: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 41 మంది రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. డంగబద్ర సచివాలయం నుంచి ఐదుగురు, బీజేపురం సచివాలయం నుంచి 12 మంది, కొండచిల కాం సచివాలయం నుంచి 10 మంది, టి.కె. జమ్ము సచివాలయం నుంచి 14 మంది తమ రాజీనామా పత్రాలను ఇప్పటివరకు అందించారని పేర్కొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


సీతంపేట: తనిఖీలు చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం


వీరఘట్టం: బొడ్లపాడు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది

సీతంపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. పాలకొండ–సీతంపేట రహదారిలో కుడ్డపల్లి జంక్షన్ వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మద్యం, నగదు, ఇతర సామగ్రి తరలింపుపై నిఘా పెట్టినట్లు చెప్పారు.

వీరఘట్టం: వీరఘట్టం–పాలకొండ రహదారిలో పలు కూడళ్ల వద్ద ఎన్నికల కోడ్ పర్యవేక్షణ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సులు, లారీలు, బైక్‌లు ఇలా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. ఎవరైనా అక్రమంగా మద్యం, డబ్బు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కోడ్ పర్యవేక్షణ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు.

కల్యాణం.. కమనీయం

వీరఘట్టం: మండలంలో బూరుగ గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న రామాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు సర్వాజోశ్యుల సతీష్ శర్మ, రమేష్ శర్మ అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు రాములవారి కల్యాణాన్ని కన్నులారా వీక్షించి తరించారు. కల్యాణ అక్షితలు చల్లుకుని సీతారామలక్ష్మణులను దర్శించుకున్నారు.


పూజలందుకుంటున్న సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలు